క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండలంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపుతో చలో ఎస్పీడీ కార్యాలయం హైదరాబాద్ ముట్టడి సందర్భంగా బుధవారం అక్రమ అరెస్టులకు నిరసనగా భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. సీఆర్పీలు పవన్, సంతోష్, సీసీవో ప్రకాశ్, ఎంఐఎస్ ప్రశాంత్, మెసేంజర్ ప్రభాకర్, ఐఈఆర్పీ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన పలువురు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పెంచికల్‌పేట్ మండలం మురళిగూడ గ్రామానికి చెందిన మడే హన్మంతు గురువారం బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పారు. జెడ్పీటీసీ రామారావుతోపాటు పుదరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు పరిశీలన



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని భోలాపటార్, అంతాపూర్ గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో ఎంపీపీ పెందోర్ మోతిరాం గురువారం పర్యటించారు. ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బీటీ రోడ్లను పరిశీలించారు. మరమ్మతులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలని గ్రామాల ప్రజలు కోరగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సకారాం, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ప్లేట్లు అందజేత



విద్యార్థులతో ఉపాధ్యాయుడు అభిలాష్

వాంకిడి: మండలంలోని కోపగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు నూతి అభిలాష్ గురువారం ప్లేట్లు అందజేశారు. సొంత డబ్బులతో ప్లేట్లు కొనుగోలు చేసి అందించిన టీచర్‌ను తల్లిదండ్రులు అభినందించారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో నాయకులు

సిర్పూర్(టి): బీఎస్పీ నూతన మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్ తెలిపారు. అధ్యక్షుడిగా బొడ్డు రవి, ఉపాధ్యక్షులుగా కర్నె శ్రీకాంత్ పటేల్, సాయిరి రవీందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గెడెం నగేశ్, కార్యదర్శిగా మడావి గణతి, పిప్రె రాజేశ్వర్, కోశాధికారిగా కొండగొర్ల మారుతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా దుర్గం రజినీకాంత్, కార్యవర్గ సభ్యులుగా ఉష, తేజయాదవ్, నక్క భీమ్‌రావ్, షాజహాన్, ఎండీ సైఫ్, డోంగ్రె అరవింద్, సలహాదారుగా గైక్వాడ్ చొక్కారావ్ ఎన్నికయ్యారు. బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది.

రైతుకు సాగు భారం

- ఏటా పెరుగుతున్న పెట్టుబడి
- కూలీల కొరతతో ఇబ్బందులు
- ఆందోళనలో అన్నదాతలు
- మద్దతు ధర పెంచాలని వేడుకోలు



కౌటాలలోని పత్తి పంటలో కలుపు తీస్తున్న కూలీలు

కౌటాల: ఏటా పెరుగుతున్న పెట్టుబడులతో వ్యవసాయం రైతులకు భారంగా మారుతోంది. సాగు ఖర్చులు పెరుగుతుండగా పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పత్తి విత్తనం నాటే దగ్గర నుంచి పత్తితీత వరకు, వరి నాట్లు వేసినప్పటి నుంచి పంట నూర్పిడి చేసే వరకు పెట్టుబడులు గతంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగాయి. డీజిల్ ధరలు, కూలీ రేట్లు పెంచేయడంతో అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. గతంలో దుక్కి దున్నేందుకు ఎకరాకు రూ.2 వేలు ఖర్చు కాగా, ప్రస్తుతం ఏకంగా రూ.5 వేలు వరకు ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఖర్చులు..

విత్తనాలు, ఎరువులు, ఇంధన ధరలతో పాటు కూలీల రేట్లు కూడా గణనీయంగా పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 3.51 లక్షల ఎకరాల్లో పత్తి, 60వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. వరి సాగు ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. నారు పోయడం, నాట్లు వేయడం, కలుపు తీయడానికి దాదాపు రూ.6 వేల వరకు ఖర్చు కాగా, విత్తనాలకు రూ.1100, కోతకు రూ.300, ఎరువులకు రూ.4 వేలు, పురుగు మందుల కూలీలకు రూ.1500 ఇలా తెగుళ్ల సోకే కొద్ది పెట్టుబడి కూడా పెరుగుతోందని రైతులు వాపోతున్నారు. పత్తి పంటకు ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.40 వేల దాకా పెట్టుబడి ఖర్చు అవుతుంది. కూలీల రేట్లు పెరిగినా ప్రస్తుతం పత్తి కలుపు తీయడానికి కూలీలు దొరకడం లేదు. పత్తి చేనులో అరకతో గడ్డి దున్నడానికి ప్రస్తుతం రూ.1500 చెల్లిస్తున్నారు. అయినా అరకలు సమయానికి దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పెరిగిన ఖర్చుల కారణంగా పంటలు సాగు చేసేందుకు కౌలు రైతులు జంకుతున్నారు.

గిట్టుబాటు ధర తక్కువే..

పత్తి రైతులను మూడేళ్లుగా అధిక వర్షాలు వెంటాడుతున్నాయి. దీంతో పంటకు వేరు కుళ్లు తెగులు సోకి పంట ఎదుగుదల తగ్గుతుంది. గడ్డిని తొలగించడానికి, తెగుళ్ల నివారణకు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. దీంతో ఖర్చు భారీగా పెరుగుతోంది. దీనికి తోడు ఏటా దిగుబడి కూడా చాలా వరకు తగ్గుతుందని, ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర పెంచి ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

ఏటా పెట్టుబడి పెరుగుతోంది



పెన్‌గంగా నది సరిహద్దులో ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఇటీవల వరదలకు పత్తి మొక్కలు కుళ్లిపోయాయి. మళ్లీ పత్తి విత్తనాలు వేశాం. ఏటా పంటల సాగు పెట్టుబడి పెరుగుతోంది. పెరిగిన ధరలతో పంటలు సాగు చేయడం కష్టంగా మారింది. ప్రభుత్వాలు పత్తి పంటకు రూ.15వేల వరకు మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలి.

– సిడాం ప్రశాంత్, వీర్దండి

పత్తిలో అరకతో దున్నిస్తున్నా..



ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పత్తి పంటలో సస్యరక్షణ పనులు చేస్తున్నా. పత్తి పంటలో గడ్డి పెరగడంతో రూ.1500 కూలీ చెల్లించి అరకతో దున్నిస్తున్నా. కూలీల రేట్లతో పాటు మందులు, ఎరువుల రేట్లు సైతం పెరిగాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం రైతులకు ఉచితంగా ఎరువులు, విత్తనాలు, యంత్రాలు అందించాలి.

– రాములు, గురుడుపేట

గుంతల రోడ్లు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్ (టి) వరకు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీరోజు ఈ మార్గం గుండా వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సిర్పూర్ (టి), కౌటా ల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాలతోపాటు మహారాష్ట్రకు కూడా ఈ మార్గంలోనే వెళ్తుంటారు. ప్రతినిత్యం ఈ మార్గం గుండా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నప్పటికీ రోడ్డుకు మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో బైక్‌పై వెళ్లేవారు కిందపడి గాయాల పాలవుతున్నారు.

అధిక లోడ్ వాహనాలతోనే..

ఈ మార్గంలో అధిక లోడ్‌తో భారీ వాహనాలు వెళ్తుంటాయి. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కంకర లోడ్‌తో లారీలు కాగజ్‌నగర్‌కు ప్రతిరోజు వస్తుంటాయి. అదేవిధంగా కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే లారీలు కూడా ఈ మార్గంలోనే వెళ్తుంటాయి. దీంతో రోడ్డు గుంతలమయంగా మారిందనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ప్రధాన రహదారికి మరమ్మతు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని తుంపెల్లిలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, పశు వైద్యసిబ్బంది మురళీకృష్ణ గురువారం పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. దాంతో పాటు గుడెన్‌ఘట్ గ్రామానికి చెందిన ఆరుగురికి రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా పత్రాలు అందజేశారు. ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచ్ వరలక్ష్మి, బలరాం, నాయకులు సత్యనారాయణ, పురుషోత్తం, వినోద్ ఉన్నారు.



టీకా వేస్తున్న జెడ్పీటీసీ

25న సామూహిక వరలక్ష్మీ వ్రతం

కౌటాల: మండల కేంద్రంలోని గుట్ట పై గల శ్రీ కంకలమ్మ దేవి-కేతేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈ వ్రతంలో పాల్గొనాలని కోరారు.

డైలీవేజ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: డైలీవెజ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ కమిటీ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి జీవో నెం 16ను సవరించి డైలీవేజ్ అనే పదం చేర్చాలన్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తయినవారికి రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేసి కార్మికుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డు, యూనిఫాం, వేతనాలతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లోకేశ్, నాయకులు ఓదెలు, కోటయ్య, డైలీవేజ్ కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దహెగాం: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాపిలె సంతోష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ బక్కయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వచ్చి 9 ఏళ్లవుతున్నా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడంలో విఫలమైందన్నారు. కుమురం భీం జిల్లాలో సుమారు ఆరు వందల కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. మండల నాయకులు నితీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ యువకుల శ్రమదానం

కెరమెరి: మండలంలోని కొఠారి గ్రామానికి చెందిన ఆదివాసీ యువకులు శ్రమదానంతో గురువారం రోడ్డుకు మరమ్మతు చేశారు. గ్రామానికి సమీపంలో మూలమలుపు వద్ద రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. అయినా అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. చేసేదేమి లేక యువకులు సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. కాగా, గోయగాం వరకు గుంతలుపడ్డ చోట రోడ్డును బాగు చేశారు. యువకులు చహకటి రాంకిషన్, జంగు తదితరులు ఉన్నారు.

మరమ్మతు చేస్తున్న యువకులు ➤



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో విద్యారంగ సమస్యలు ఎక్కడి గొంగడి అక్కడే అన్నచందంగా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చి తొమ్మిదేళ్లు గడిచిపోతున్నా విద్యారంగం, విద్యార్థుల పట్ల సవితితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా, డీఎస్సీ వేయకుండా నాన్చుతుందన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన సత్రం ప్రారంభించి రెండేళ్లు పూర్తయి మూడవ సంవత్సరంలో అడుగిడిన సందర్భంగా శుక్రవారం సత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆయన సతీమణి రమాదేవిలు పూజల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేద పండితులు కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంతోపాటు ఇతర అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నప్రసాదం వితరణ చేయనున్నారు.

నేడు చెక్కుల పంపిణీ

కాపువాడలో గల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీసీబంధు చెక్కులు పంపిణీ చేయనున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రజక సంఘం నాయకులు

మార్కెట్ ఏరియా రజక సంఘం అధ్యక్షుడు జి.రాజేష్ ఆధ్వర్యంలో సంఘం పదాధికారులు ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, రూ.25 లక్షలతో రజక సంఘం కమ్యూనిటీ హాల్, మోడ్రన్ ధోబిఘాట్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే సంఘం పదాధికారులకు హామీ ఇచ్చారు.

చెరువుకు మరమ్మతు ఏది ?

- కట్ట తెగినా పట్టించుకోని అధికారులు
- పంటలకు సాగునీరందక ఆయకట్టు రైతుల ఇక్కట్లు
- ఏటా తిప్పలు



తెగిపోయిన ఇప్ప చెరువుకట్ట

బెజ్జూర్: దేవుడు వరమిచ్చినా..పూజారి కరుణించలేదన్న చందంగా మారింది ఇప్ప చెరువు పరిస్థితి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ చెరువు గత కొన్నేళ్లుగా కట్టతెగిపోయి నిరుపయోగంగా ఉంది. ఇటీవల భారీ వర్షాలు కురిసినప్పటికీ చెరువులో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేకుండా పోయింది. చెరువుకు మరమ్మతు చేయకపోవడంతో ప్రతీఏటా రైతులు సాగునీరు అందకుండా పోతోంది. కట్ట మరమ్మతు పనులు చేపడితే చెరువులో పుష్కలంగా నీరు ఉంటుందని, దీంతో తాము పంటలకు సాగునీరు అందిచగలుగుతామని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

మరమ్మతుకు నోచుకోని వైనం..

మండల కేంద్రానికి సమీపంలోని ఇప్ప చెరువు ఉన్నప్పటికీ రైతులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. ఈ చెరువు కట్ట దెబ్బతినడంతో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేకుండా పోయింది. మండలంలోని బెజ్జూర్, ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్ ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకునేందుకు నీరందక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ చెరువు కట్టతో పాటు పార్లు మత్తడి సైతం ఎక్కడికక్కడ చెడిపోవడంతో నీరు ఆగే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురువక, చెరువులో నీరు లేకపోవడంతో నాట్లు వేసేందుకు రైతులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

గతేడాది తాత్కాలిక మరమ్మతు

అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువుకు మరమ్మతు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులే తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. దాదాపు వంద మంది వరకు రైతులు విరాళాలు సేకరించి ఆ డబ్బులతో బస్తాల్లో మట్టి నింపి చెరువు కట్టకు తాత్కాలికంగా మరమ్మతు చేపట్టారు. కాగా ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఆ బస్తాలు కొట్టుకపోవడంతో మళ్లీ పరిస్థితి మొదటికే వచ్చింది. దీంతో ఆయకట్టు రైతులు ఏటా అవస్థలు పడాల్సి వస్తోంది.

పట్టించుకోవడం లేదు



చెరువు కట్ట చెడిపోయింది. ఏళ్లుగా మరమ్మతు చేపట్టడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. చెరువు కట్ట కింద మూడు నాలుగు గ్రామాలకు చెందిన వందల ఎకరాల భూమి ఉంది.

– కుట్రంగి సంధయ్య, రైతు, సిద్దాపూర్

చర్యలు తీసుకోవాలి



ఇటీవల భారీగా వర్షాలు కురిసినప్పటికీ ప్రస్తుతం చెరువులో నీరు లేదు. చెరువు కట్ట తెగిపోయి ఉండడంతో నీరు ఆగని పరిస్థితి ఉంది. ప్రతిఏటా ఇదే దుస్థితి. చెరువు ద్వారా పంటలకు నీరు అందించలేకపోతున్నాం. వెంటనే మరమ్మతు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నికాడి శంకర్, రైతు, చిన్నసిద్దాపూర్

సంక్షిప్త వార్తలు

5కే రన్ విజయవంతం చేయాలి

సిర్పూర్(టి): మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ లలిత కోరారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐవోట్ ఫర్ ష్యూర్ అని ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు మండలంలోని 18 ఏళ్లునిండిన ఓటర్లు, ప్రజాప్రతినిధులతో 5కే రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక బస్టాండ్ చౌరస్తా నుంచి 5కే రన్ ప్రారంభమై రుద్రారం రైస్ మిల్లు వరకు కొనసాగుతుందని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆసిఫాబాద్: గాదిగూడ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ సభ్యులు డాక్టర్ గణేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గాదిగూడకు చెందిన పరుశరాం, బలిరాం, గజానంద్‌తో పాటు వివిధ పార్టీల నాయకులకు కండువా కప్పారు.

ఆర్థికసాయం

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన ధన్నూరి రాజు పాముకాటుకు మృతి చెందగా కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, నాయకులు ఖైరత్, వెంకటి, మారన్న ఉన్నారు.

దివ్యాగుడికి వీల్‌చైర్ అందజేత

వాంకిడి: మండలంలోని సల్పలగూడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు కుంరం బొజ్జిరావుకు వాంకిడి పోలీస్ ఆధ్వర్యంలో గురువారం వీల్‌చైర్ అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాలతో పుట్టుకతోనే పోలియో బారిన పడ్డ బొజ్జిరావుకు చక్రాల కుర్చీ అందించామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సాగర్, తేజస్విని పాల్గొన్నారు.

సన్మానం

ఆసిఫాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ఎంపికై కలెక్టర్‌తో ప్రశంసపత్రం అందుకున్న పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణను జిల్లా కేంద్రంలోని జీపీ కార్యాలయంలో బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. పట్టణ అధ్యక్షుడు అహ్మద్‌బిన్ అబ్దుల్లా, ఉబేద్‌బిన్ యాహియా, నిసార్, ఎండీ అహ్మద్, షబ్బీర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పరామర్శ

దహెగాం: మండలంలోని అమర్‌గొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుమ్మిడె పాపయ్య తండ్రి ఇటీవల మృతి చెందాడు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ రామారావు, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, సర్పంచులు బండ క్రిష్ణమూర్తి, వెంకటేశ్, నాయకులు ఉన్నారు.

బెజ్జూర్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

బెజ్జూర్: మండల కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదవుల కోసం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు గడ్డల సాయి, కరణ్, నితిన్, సాయి, ఆడే సాగర్ పాల్గొన్నారు.